సాక్షి
తిరుపతి
సోమవారం ׀ 11 ׀ ఆగస్టు ׀ 2025



మన బండ్లే .. వదిలేయండి!
కలువాయిలో రెవెన్యూ, పోలీసులు ఇసుక ట్రాక్టర్లు పట్టుకున్నారు. కూటమి నేతల నుంచి ఫోన్లు రావడంతో వదిలేశారు.
- 8లో



గూడు చెదిరె.. గోడు మిగిలె!
శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పేదల ఇళ్లను అధికారులు నేలమట్టం చేయడంపై లబోదిబోమంటున్నారు.
- 8లో



బురిడీ కొట్టించిన మహిళలు అరెస్టు
బంగారం దుకాణంలో నగల కొనుగోలుకు వచ్చి బంగారు నగలు కాజేసిన మహిళలను పోలీసులు పట్టుకున్నారు.
- 8లో

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

తిరుపతి అర్బన్ : కలెక్టరేట్‌లో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించ నున్నారు. అయితే జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ శ్రీకాళహస్తిలో జరుగుతున్న గ్రీవెన్స్‌కు హాజరు కానున్నారు. దీంతో జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ నేతృత్వంలో కలెక్టరేట్‌లో సోమవారం గ్రీవెన్స్ చేపట్టనున్నారు.

ఐసీడీఎస్‌లో ఉద్యోగానికి దరఖాస్తులు

తిరుపతి అర్బన్ : ఐసీడీఎస్‌లో కాంట్రాక్ట్ పద్ధతిలో జిల్లా ప్రాజెక్టు అసిస్టెంట్‌గా పనిచేయడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ పీడీ వసంతబాయి ఒక ప్రకటనలో ఆదివారం వెల్లడించారు. ఈనెల 11 నుంచి 20 వరకు దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని చెప్పారు. పోస్టు ద్వారా లేదా కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో దరఖాస్తు ఇవ్వాలని తెలిపారు. 25–42 వరకు వయోపరిమితి ఉండాలని, ఓసీ అభ్యర్థులు రూ.250, ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు అయితే రూ.200 నగదు దరఖాస్తుతో పాటు చెల్లించాలని స్పష్టం చేశారు. అదనపు సమాచారం కోసం తిరుపతి.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ చూడాలని సూచించారు.

నేటితో ముగియనున్న ఇంటర్ ప్రవేశాలు

తిరుపతి సిటీ: జిల్లాలోని ప్రభుత్వ,హైస్కూల్ ప్లస్, ఎయిడెడ్, రెసిడెన్షియల్, సోషల్ వెల్ఫేర్, మోడల్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ అడ్మిషన్ల ప్రక్రియ సోమవారంతో ముగియనుంది. ఈ మేరకు ఇప్పటికే రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యామండలి ఉత్తర్వులు జారీ చేసింది. ఆసక్తిగల విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశాల కోసం ఆయా కళాశాల ప్రిన్సిపల్స్‌ను సంప్రదించాలని ఆర్ఐఓ రాజశేఖర్‌రెడ్డి సూచించారు.

21న రాగి రేకులకు టెండర్ కమ్ వేలం

తిరుపతి అన్నమయ్య సర్కిల్ : తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు ఇతర అనుబంధ ఆలయాలకు హుండీ ద్వారా భక్తులు కానుకగా సమర్పించిన కాపర్ సిల్వర్ కోటెడ్ రాగి రేకులు ఈ నెల 21వ తేదీన టెండర్ కమ్ వేలం (ఆఫ్‌లైన్) వేయనున్నారు. ఈ మేరకు ఆదివారం టీటీడీ ముఖ్య ప్రజాసంబంధాల అధికారి పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఇతర వివరాలకు తిరుపతిలోని హరేరామ హరేకృష్ణ రోడ్డులో గల టీటీడీ మార్కెటింగ్ కార్యాలయం (వేలం) 0877–2264429, నంబర్లలో కార్యాలయం పనివేళల్లో లేదా టీటీడీ వెబ్‌సైట్ ను సంప్రదించాలి.

18న చలో ఢిల్లీ

తిరుపతి కల్చరల్: బీసీల సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో ఈనెల 18,19వ తేదీల్లో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేయనున్న తరుణంలో ఛలో ఢిల్లీ కార్యక్రమానికి బీసీ సంఘాల ప్రతినిధులందరూ తరలి వచ్చి జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వై.నాగేశ్వర యాదవ్, దక్షిణాది రాష్ట్రాల ఇన్‌చార్జ్ షణ్ముగం, జిల్లా అధ్యక్షుడు తురక అమరనాథ్ పిలుపునిచ్చారు. జాతీయ బీసీ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చలో ఢిల్లీ కరపత్రాలను జోష్ ప్రాపర్టీస్ అధినేత ఈశ్వర్ ప్రకాష్ చేతుల మీదుగా ఆవిష్కరించి మాట్లాడారు. బీసీల సమస్యలను ప్రస్తావించారు. కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధికార ప్రతినిధి కొండా రామారావు, జ్ఞానశేఖర్, రవి, శరవణ, సందీప్, వెంకటేష్, కిషోర్, బీసీ నేతలు పాల్గొన్నారు.


1న పెన్షన్ మార్చ్ జయప్రదం చేయండి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఏపీ సీపీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నేతలు

తిరుపతి కల్చరల్ : సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 1న విజయవాడ, గుంటూరు మధ్య భారీ స్థాయిలో చేపట్టే పెన్షన్ మార్చ్‌లో ఉద్యోగులందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ సీపీఎస్ఈఏ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు చీర్ల కిరణ్ పిలుపు నిచ్చారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పెన్షన్ మార్చ్‌కు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించి ప్రసంగించారు. 20 ఏళ్లుగా రాష్ట్రంలోని 4 లక్షల మంది సీపీఎస్ ఉద్యోగులు పెన్షన్ రాకుండా ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తి అయినా సీపీఎస్ రద్దుపై కనీసం ఉద్యోగులతో చర్చలు జరపలేదన్నారు. సీపీఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎస్ వెన్నుపోటు పొడిచిన రోజుగా భావిస్తూ సెప్టెంబర్ 1న పెన్షన్ మార్చ్ చేపడుతున్నామని తెలిపారు. సమావేశంలో ఏపీసీపీఎస్ఈఏ జిల్లా అధ్యక్షుడు వంకీపురం పవన్, ఏపీ ప్రభుత్వం ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు రామచంద్రయ్య, కోశాధికారి శ్రీనివాసులు, చలపతి పాల్గొన్నారు.

అడ్మిషన్లు.. అయోమయం!



'శ్రీకాళహస్తికి చెందిన ఓ విద్యార్థిని ఏపీఈఏఎమ్‌సెట్–2025లో మంచి ర్యాంకు సాధించింది. గత నెలలో జరిగిన తొలి విడత కౌన్సెలింగ్ ప్రక్రియలో చంద్రగిరి సమీపంలోని ఓ ప్రైవేటు కళాశాలలో సీఎస్ఈలో సీటు సాధించి అడ్మిషన్ పొందింది. కానీ రెండవ విడతలో మరో మెరుగైన కోర్సు కోసం వెబ్ ఆప్షన్ పెట్టుకుంది. స్థానికత రిజర్వేషన్ల విషయంలో ప్రవేశాలపై హైకోర్టు స్టే విధించడంతో పరిస్థితి అయోమయంగా తయారైంది. కళాశాల యాజమాన్యం తరగతులకు హాజరు కావాలంటూ ఒత్తిడి చేస్తుండటం, మళ్లీ రీ కౌన్సెలింగ్ జరుగుతుందనే గందరగోళంలో సతమతమవుతున్నారు.'

ఇంజినీరింగ్ విద్యార్థుల భవితవ్యం అయోమయంగా మారింది. తొలి విడతలో ప్రవేశాలు పొందిన విద్యార్థుల పరిస్థితి గందరగోళంగా తయారైంది. ఇప్పటికే స్థానికతపై కోర్టుకు వెళ్లడంతో అడ్మిషన్ల ప్రక్రియ అర్ధంతరంగా ఆగిపోయింది. రిజర్వేషన్లు తేల్చకుండా ప్రవేశాలు నిర్వహించడంపై నిపుణులు మండిపడుతున్నారు. ఒకవైపు తరగతులకు హాజరు కావాలని కళాశాలలు ఒత్తిడి చేస్తున్నాయి..మరోవైపు న్యాయ స్థానం రీకౌన్సెలింగ్‌కు ఆదేశిస్తే పరిస్థితి ఏంటో ఊహించడం కష్టంగా మారింది. సాంకేతిక విద్యామండలి అధికారుల నిర్లక్ష్యంతో విద్యార్థుల భవిష్యత్తు అంధకారంగా మారుతోంది.

ఇంజినీరింగ్ ప్రవేశాలపై తొలగని సందిగ్ధం

- ఆందోళనలో తొలి విడత ప్రవేశాలు పొందిన విద్యార్థులు
- కళాశాలకు హాజరు కావాలంటూ ప్రైవేటు యాజమాన్యాల ఒత్తిళ్లు
- రీకౌన్సెలింగ్ జరిగితే పరిస్థితి ఏమిటో అర్థం కాలేదంటున్న తల్లిదండ్రులు
- కోర్టులో స్థానికత సమస్య తేలేదీ ఎప్పుడో అంటూ నిట్టూరుస్తున్న విద్యార్థులు

తిరుపతి సిటీ : ఏపీఈఏఎమ్‌సెట్–2025 కౌన్సెలింగ్ ప్రక్రియ అస్తవ్యస్తంగా మారింది. స్థానిక, స్థానికేతర రిజర్వేషన్ల విషయంలో కోర్టు మెట్లు ఎక్కడంతో ఇంజినీరింగ్ అడ్మిషన్ల ప్రక్రియ అర్ధాంతరంగా నిలిచిపోయింది. దీంతో జిల్లా వ్యాప్తంగా సుమారు 40 వేల మంది విద్యార్థుల పరిస్థితి దారుణంగా తయారైంది. ఇప్పటికే తొలి విడత అడ్మిషన్లు పొందిన విద్యార్థుల పరిస్థితి అయోమయంలో పడింది. ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు తొలి విడత కౌన్సెలింగ్‌లో ప్రవేశాలు పొందిన విద్యార్థులను తరగతులకు హాజరు కావాలని ఒత్తిడి చేస్తున్నారు. దీంతో ఎటూ తేల్చుకోలేని స్థితిలో విద్యార్థులు, తల్లిదండ్రులు అయోమయంలో పడ్డారు. మళ్లీ రీ కౌన్సెలింగ్‌కు న్యాయస్థానం ఆదేశిస్తే పరిస్థితి ఏమిటి... అంటూ ఆవేదన చెందుతున్నారు.

రిజర్వేషన్లు తేల్చకుండా ప్రవేశాలు ఎలా?

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి నాటి నుంచి ఏ ఒక్క వ్యవస్థను సక్రమంగా నిర్వహించడంలేదని నిపుణులు నిప్పులు చెరుగుతున్నారు. విద్యావ్యవస్థను సర్వనాశనం చేసిందని విమర్శిస్తున్నారు. ఎంతో ప్రతిష్టాత్మకమైన ఇంజినీరింగ్ అడ్మిషన్ల ప్రక్రియను అస్తవ్యస్తం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక, స్థానికేతర రిజర్వేషన్లను తేల్చకుండా కౌన్సెలింగ్ ప్రక్రియను ఎలా చేపడుతుందని ప్రశ్నిస్తున్నారు. అర్హతలేని వ్యక్తులు, కనీస పరిజ్ఞానం లేని వ్యక్తుల చేతుల్లోకి పాలన వస్తే పరిస్థితి ఎలా ఉంటుందో ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ ప్రక్రియను చూస్తే అర్థమవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తొలి విడతలో ప్రవేశాలు పొందిన విద్యార్థుల పరిస్థితి అయోమయంలో పడిందని ఇందుకు ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు.

జిల్లా సమాచారం

ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలలు	2
ప్రైవేటు కళాశాలలు	11
అటానమస్ కళాశాలలు	5
డీమ్డ్ యూనివర్సిటీలు	2
అన్ని కళాశాలలో సీట్ల సంఖ్య	31,750
తొలి విడతలో సీట్లు పొందిన విద్యార్థులు	12,218
రెండవ విడత కౌన్సెలింగ్‌కు వెబ్ ఆప్షన్లు పెట్టిన వారు	21,475

అడ్మిషన్లు నిలిచిపోవడంతో అర్థం కావడం లేదు..



మా అమ్మాయికి ఏపీఈఏఎమ్‌సెట్–2025లో ర్యాంక్ వచ్చింది. కానీ తొలి విడతలో సీటు రాలేదు. రెండవ విడత వెబ్ ఆప్షన్ల ప్రక్రియలో సీటు కోసం ఆప్షన్లు పెట్టుకున్నాం. పక్కా సీటు ప్రభుత్వ, డీమ్డ్ కళాశాలలో వస్తుందని ఆశించాం. కానీ అడ్మిషన్లు నిలిచిపోవడంతో ఏమి చేయాలో అర్థం కావడంలేదు. మళ్లీ రీ కౌన్సెలింగ్ చేపడితే సీటు వస్తుందని నమ్మకం లేదు. కానీ పేమెంట్ సీటు కోసం ఓ ప్రముఖ కళాశాలలో దరఖాస్తు చేశాం. కళాశాల యాజమాన్యం త్వరగా ప్రవేశం తీసుకోండి. సీట్లు ముగింపు స్థాయికి చేరుకున్నాయంటూ తొందర పెడుతున్నారు. – సరస్వతమ్మ, విద్యార్థి తల్లి, తిరుపతి

మా పరిస్థితి వర్ణనాతీతం



గతంలో ఏటా క్రమం తప్పకుండా ఆగస్టులో ఇంజినీరింగ్ అడ్మిషన్లు పూర్తి చేసి తరగతులు ప్రారంభించేవారు. కానీ ఈ ఏడాది పరిస్థితి దారుణంగా తయారైంది. ప్రవేశాలు నిలిచిపోవడంతో ఏపీఏఎమ్‌సెట్‌లో సాధారణ ర్యాంక్ వచ్చిన మా లాంటి వారి పరిస్థితి అర్థం కావడంలేదు. ప్రైవేటు కళాశాల యాజమాన్యాలు త్వరగా పేమెంట్ సీటులో ప్రవేశాలు పొందాలంటూ మెసేజ్‌లు పెడుతున్నారు. కానీ రెండు, మూడవ విడతలలో ఫ్రీ సీటు వస్తుందనే ఆశతో ఉన్నాం. మా పరిస్థితి వర్ణనాతీతం. – శ్రావణి ప్రియ, విద్యార్థిని, తిరుపతి

అధికారుల నిర్లక్ష్యం

ఇంజినీరింగ్ అడ్మిషన్ల ప్రక్రియ నిలిచిపోవడానికి ప్రధాన కారణం రాష్ట్ర సాంకేతిక విద్యామండలి నిర్లక్ష్యం, అసమర్థతే. కూటమి ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటోంది. ఇంజినీరింగ్ ప్రవేశాల ప్రక్రియ తొలి విడత పూర్తి అయ్యేంత వరకు స్థానిక, స్థానికేతర రిజర్వేషన్ల విషయంపై అవగాహన లేకపోవడం అధికారుల అలసత్వానికి నిదర్శనం. డిగ్రీ, పీజీ అడ్మిషన్లు ప్రక్రియపైనా అయోమయం నెలకొంది. – నారాయణరెడ్డి, విశ్రాంత అధ్యాపకులు, తిరుపతి

రీ కౌన్సెలింగ్ భయం ఉంది



కూటమి ప్రభుత్వం విద్యావ్యవస్థను సర్వనాశనం చేసింది. ఏ ఒక్క కోర్సులోనూ ప్రవేశాలు సక్రమంగా చేపట్టలేదు. సాంకేతిక విద్యామండలి అధికారుల తీరు అనుమానాలకు తావిస్తోంది. అనుభవరాహిత్యమా? లేక అధికార మదమో తెలియదు కానీ ఇంజినీరింగ్ అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టిన తీరు దారుణంగా ఉంది. మా అబ్బాయికి ఎస్వీయూలో తొలి విడతలో ఈసీఈలో సీటు దక్కడంతో ప్రవేశం తీసుకున్నాం. కోర్టు స్టేతో పరిస్థితి అర్థం కావడం లేదు. తొలి విడత ఫలితాలను రద్దు చేసి మళ్లీ రీకౌన్సెలింగ్ నిర్వహిస్తారనే భయం ఉంది. – రత్నప్రభ, విద్యార్థి తల్లి, తిరుపతి

తరగతులకు హాజరు కావాలా? వద్దా?



తొలి విడత ఇంజినీరింగ్ కౌన్సెలింగ్‌లో మా అమ్మాయికి తిరుపతి శివారులోని ఓ ప్రముఖ కళాశాలలో సీఎస్ఈ ఏఐ బ్రాంచ్‌లో సీటు వచ్చింది. అడ్మిషన్ అయ్యాం. కానీ రెండవ విడత కౌన్సెలింగ్ పూర్తి కావస్తున్న సమయంలో స్థానికత రిజర్వేషన్ల సమస్యతో ప్రవేశాలపై కోర్టు స్టే విధించింది. స్థానికత సమస్య ఎప్పుడు పరిష్కారమవుతుందో తెలియడంలేదు. కానీ కళాశాల నుంచి తరగతులకు హాజరు కావాలని ఫోన్‌లు, మెసేజ్‌లు వస్తున్నాయి. వెళ్లాలా? వద్దా ? అర్థం కాని పరిస్థితి నెలకొంది. – రామచంద్రయ్య, విద్యార్థి తండ్రి, రేణిగుంట

ప్రవేశాలు గందరగోళంగా మారాయి



నేను ఏపీఈఏఎమ్‌సెట్‌లో మంచి ర్యాంక్ సాధించా. జిల్లాలోని ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో ఈసీఈలో జాయిన్ అయ్యాను. అడ్మిషన్ల ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేస్తూ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. తరగతులకు హాజరు కావాలని కళాశాల నుంచి ఫోన్లు వస్తున్నాయి. రీ కౌన్సెలింగ్ జరిగితే మళ్లీ నాకు ఆ కళాశాలలో సీటు వస్తుందా... అనే అనుమానం ఉంది. – రవిశంకర్, విద్యార్థి, తిరుపతి

16న గోకులాష్టమి

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : టీటీడీ శ్రీ వేంకటేశ్వర గోసంరక్షణశాలలో ఈనెల 16వ తేదీన గోకులాష్టమి వేడుకలను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా గోసంరక్షణశాలలో గోపూజ, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టనున్నారు. గోశాలలోని గోసంపదను అందంగా అలంకరించి భూలోక గోకులంగా తీర్చిదిద్దేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ముత్యాల రంగవల్లికలతో తీర్చిదిద్దుతున్నారు. గోశాలకు విచ్చేసే భక్తులు గోశాలలో బెల్లం, బియ్యం, పశుగ్రాసాన్ని భక్తులు స్వయంగా పశువులకు తినిపించే అవకాశాన్ని టీటీడీ కల్పిస్తోంది. గోకులాష్టమి సందర్భంగా ఎస్వీ గోసంరక్షణశాలలో ఉదయం 5 నుండి 10.30 గంటల వేణుగానం, తిరుమల వేదపాఠశాల విద్యార్థులచే వేదపారాయణం, టీటీడీ దాససాహిత్య ప్రాజెక్టు కళాకారులతో భజనలు, కోలాటాలు వంటి కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఉదయం 10.30 నుంచి 11 గంటల వరకు శ్రీ వేణుగోపాల స్వామివారి సన్నిధిలో గోపూజ, వేణుగోపాలస్వామి హారతి నిర్వహించనున్నారు. ఉదయం 11 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు, శ్రీ వేణుగోపాల స్వామివారి దర్శనం, ప్రసాదం పంపిణీ చేస్తారు. సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో హరికథ కార్యక్రమం నిర్వహించనున్నారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 84,404 మంది స్వామివారిని దర్శించుకోగా 34,930 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.06 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

కూటమి దుష్ప్రచారాలను తిప్పికొట్టాలి



పార్టీ విధి విధానాలకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేస్తున్న భూమన అభినయ్, పార్టీ శ్రేణులు

- ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎండగడుతున్నామనే కక్ష
- పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేసిన భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం: కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు వినూత్న కార్యక్రమాలతో ఎండగడుతున్నామనే కక్షతోనే వైఎస్సార్‌సీపీతో పాటు తమ కుటుంబంపై కూటమి నేతలు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుపతి ఎయిర్ బైపాస్‌రోడ్డు, న్యూబాలాజీ కాలనీలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఆదివారం వైఎస్సార్‌సీపీ శ్రేణులకు క్రమశిక్షణ తరగతులు నిర్వహించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిబద్ధత, క్రమశిక్షణ కలిగిన పార్టీ అని పార్టీకి చెడ్డపేరు తెచ్చేలా ఎవ్వరూ వ్యవహరించమంటూ పార్టీ శ్రేణులు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా భూమన అభినయ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చి న హామీలను అమలు చేయకుండా మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వ వ్యతిరేక విధానాలను తిరుపతి నుంచి ఎండగడుతూ కూటమి నాయకుల గుండెల్లో దడ పుట్టిస్తున్నామన్నారు. అది కూటమి నాయకులు జీర్ణించుకోలేక ఎల్లో సోషయల్ మీడియాలో వైఎస్సార్‌సీపీతో పాటు భూమన కుటుంబంపై ఇష్టమొచ్చినట్లు పోస్టింగ్లు పెడుతూ బురదజల్లే ప్రయ త్నం చేస్తున్నారని మండిపడ్డారు. తిరుపతి నగరంలో కూటమి దుష్ప్రచారాలను తిప్పికొట్టేలా వైఎస్సార్‌సీపీ సోషయల్ మీడియా చురుగ్గా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ లోపాలను ప్రజల కు వివరిస్తూ ప్రజాసంక్షేమమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు పనిచేయాలన్నారు. కూటమి చేస్తున్న దుష్ప్రచారాలకు భయపడే ప్రసక్తేలేదని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డితో పాటు కార్పొరేటర్లు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ఇదేం న్యాయం రక్షకా?

తిరుపతిలో సంచలనం రేపిన పవన్‌పై దాడి ఘటన

- దాడి చేసిన వారిని అరెస్ట్ చూపించని పోలీసులు
- దాడి చేయని వారిపై కక్ష సాధింపు చర్యలు
- అధికార పార్టీ నేతల ఒత్తిడే కారణమా?



వన్‌పై దాడి చేస్తున్న దినేష్



దినేష్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు

తిరుపతి క్రైం: శాంతిభద్రతలను పరిరక్షించాల్సిన పోలీసులు అధికార పార్టీకి తొత్తులుగా మారిపోయారు. తిరుపతిలో సంచలనం రేకెత్తించిన పవన్‌పై దాడి ఘటనలో జనసేన పార్టీకి చెందిన దినేష్ ప్రధాన ముద్దాయిగా ఉన్నా అతన్ని ఇంతవరకు అరెస్టు చూపించ లేదు. పవన్‌పై దాడి చేయకపోయినా ఏ2, ఏ3 నిందితులుగా చేర్చి అనిల్‌కుమార్ రెడ్డి, జగ్గారెడ్డిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం చర్చనీయాంశంగా మారింది.

ఇంత బరితెగింపా..

పవన్‌పై దాడి ఘటనతో మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ తిరుపతి, చిత్తూరు జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి కుటుంబానికి ఏ మాత్రం సంబంధం లేదు. అయినా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా విభాగం అధ్యక్షుడిగా ఉన్న అనిల్‌కుమార్‌రెడ్డిని టార్గెట్‌గా చేసుకుని ఆయన అనుచరులు బరితెగించారంటూ ఎల్లోమీడియా మూడు రోజులుగా విషం చిమ్ముతోంది. పచ్చి అబద్ధాలతో పైశాచిక ఆనందం పొందుతోంది. టీటీడీ చైర్మన్‌పై విమర్శలు చేసిన భూమన ప్రతిష్టను దెబ్బతీసేందుకు ఎల్లో మీడియా కంకణం కట్టుకుంది. అధికార కూటమి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న జనసేన పార్టీ కార్యకర్త దినేష్ పవన్‌ను లాఠీతో చావగొట్టే వీడియో బయటకొచ్చినా అతనిపై చర్యల్లేవు. ఈ ఘటనలో ఇప్పటికే తిరుపతి ఈస్ట్ పోలీసులు ఎఫ్ఐఆర్– 368/25 కింద ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఏ1గా దినేష్, ఏ2గా అనిల్‌కుమార్‌రెడ్డి, ఏ3 జగ్గారెడ్డి అండ్ అదర్స్ అంటూ కేసు కేసు నమోదు చేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. ఏ2, ఏ3లుగా ఉన్న అనిల్‌కుమార్‌రెడ్డి, జగ్గారెడ్డితో పాటు, ఏ1గా ఉన్న దినేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. ఆపై ఏ2, ఏ3లుగా ఉన్న వారిని మాత్రమే రిమాండ్‌కు తరలించారు. ఏ1గా ఉన్న దినేష్‌ను ఇంతవరకు అరెస్టు చూపించలేదు. 'నాపై దాడి ఘటనలో ఎవరి ప్రమేయం లేదు.. మీరు ఎందుకు అత్యుత్సాహం చూపిస్తున్నారు..' అంటు బాధితుడు పవన్ వీడియోలు రిలీజ్ చేయడం వెనుక ఎవరి ప్రమేయం ఉందనేది ఇప్పటి వరకు అర్థంకాని ప్రశ్న. తిరుపతి ఎస్పీ ఆదేశాల మేరకు 9 ప్రత్యేక బృందాలును రంగంలోకి దిగడంతో చిత్తూరులో ఉన్న పవన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతను ప్రస్తుతం తిరుపతి రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతనిచ్చిన సమాచారం మేరకు విచారణ మరింత వేగవంతం చేశారు.

వీటికి సమాధానం ఏదీ?

- పవన్‌పై దాడి చేసిన దినేష్‌ను ఎందుకు రిమాండ్‌కు తరలించలేదు..?
- చట్టప్రకారం ముద్దాయిని 24 గంటల్లోపు జడ్జి ముందు ప్రవేశపెట్టాలి. కానీ దినేష్‌ను తిరుపతి ఈస్ట్ పోలీసులు అరెస్ట్ చేసి 72 గంటలు దాటినా అరెస్టు చూపించకపోవడం వెనుక మతలబు ఏంటి?
- పవన్‌పై దాడి చేసే సమయంలో దినేష్‌కు ఫైబర్ లాఠీ అందించిన కానిస్టేబుల్ ఎవరు?
- వారితో పాటు ఉన్న మరొక కానిస్టేబుల్ కుమారుడు ఎవరు?
- పవన్ స్టేట్‌మెంట్‌లో ఏం సమాచారం ఇచ్చాడు?
- అతనితో సెల్ఫీ వీడియోలు రిలీజ్ చేయించింది ఎవరు?
- సెల్ఫీ వీడియోలు విడుదల చేయించాల్సిన అవసరం ఏమొచ్చింది..?
- పవన్ గారడీ మాటలు ఎలా నమ్మాలి?

.. వీటిపై పోలీసులే సమాధానం చెప్పాల్సి ఉంది.

కుండపోత వర్షం



జలమయమైన తిలక్ రోడ్డు



శ్రీనివాసం ఎదుట ఇలా..



లీలామహల్ సెంటర్లో నిలిచిన వర్షపు నీరు

తిరుపతిలో ఆదివారం సాయంత్రం 6.30 గంటల నుంచి కుండపోత వర్షం కురిసింది. పట్టణంతో పాటు జిల్లా అంతటా నాలుగైదు గంటలు ఎడతెరిపిలేని వర్షం కురిసింది. ఇన్ని రోజులు ఉక్కపోతకు గురైన జనానికి ఈ వర్షం ఉపశమనం కలిగించింది. – తిరుపతి తుడా

క్లుప్తంగా

డ్యూటీకి వెళుతూ మృత్యుఒడికి..


నవీన్‌కుమార్(ఫైల్)

ఏర్పేడు : ఏర్పేడు–వెంకటగిరి మార్గంలో ఏర్పేడు మండలం దుర్గిపేరి సమీపంలో ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై డ్యూటీకి వెళుతున్న ఓ యువకుడిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఏర్పేడు ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి కథనం మేరకు... శ్రీకాళహస్తి మండలం కుంటిపూడి గ్రామానికి చెందిన కె.చంద్రయ్య కుమారుడు కోవూరు నవీన్ కుమార్(25) మూడు నెలల కిందట కాపుగున్నేరి సమీపంలోని కోకాకోలా కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా విధుల్లో చేరాడు. ఆదివారం ఏ–షిఫ్ట్ కావడంతో కుంటిపూడి గ్రామం నుంచి ద్విచక్ర వాహనంపై ఏర్పేడు మీదుగా కోకాకోలా కంపెనీకి వెళ్లేందుకు బయల్దేరాడు. క్రిష్ణంపల్లి క్రాస్ దాటి, దుర్గిపేరి సమీపంలో ఎదురుగా వెళుతున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తలకు బలమైన రక్త గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. చంద్రయ్యకు ముగ్గురు కుమారులు కాగా, అందరికంటే చిన్నవాడు మృతుడు నవీన్‌కుమార్. మూడు నెలల కిందటనే డ్యూటీలో చేరి కుటుంబానికి కొంత ఆసరా ఉన్న కొడుకు మృతి చెందడంతో కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

వాకర్స్ సేవలు మరింత విస్తృతం



వాకర్స్‌కు ఉచితంగా బీపీ మీటర్‌ను పంపిణీ చేస్తున్న వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: వాకర్స్ ప్రతినిధులు తమ సేవలను మరింత విస్తృతం చేస్తూ సమాజ శ్రేయస్సులో భాగస్వాములు కావాలని వాకర్స్ ఇంటర్నేషనల్ ఎలెక్ట్ అధ్యక్షుడు డాక్టర్ రవిరాజు, గవర్నర్ రావిళ్ల మాధవ నాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం యూత్ హాస్టల్లో వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 302 క్యాబినెట్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వారితోపాటు రీజినల్ కౌన్సిలర్ ఆర్కాట్ కృష్ణప్రసాద్ మాట్లాడారు. అనంతరం తమిళనాడు, కర్నాటక, రాయలసీమ వాకర్స్ వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు తమ సేవా కార్యక్రమాలను వివరించారు. అనంతరం నారాయణాద్రి హాస్పిటల్ ప్రతినిధులు వాకర్స్ సంఘాలకు బీపీ పరీక్షల యంత్రాలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు రామచంద్రారెడ్డి, కోనేటి రవిరాజు, మనోహరన్, వినాయగం, వేణుగోపాల్‌రాజు, చంద్ర, శాంతి నాడార బాలాజీ నాయుడు, వాకర్స్ పాల్గొన్నారు.

గూడు చెదిరె.. గోడు మిగిలె!

నాడు సక్రమం.. నేడు అక్రమం

- ఇష్టానుసారంగా పేదల ఇళ్లు కూల్చివేత
- ప్రజాప్రతినిధి ఆదేశాలు పాటిస్తూ రెచ్చిపోతున్న అధికారులు
- ఏడాదిలో వెయ్యి వరకు పేదల ఇళ్లు కూల్చివేత


రేణిగుంట మండలంలో కూల్చివేసిన పేదల ఇళ్లు(ఫైల్)

సాక్షి టాస్క్‌ఫోర్స్: సొంతింటి కల.. సగటు పేదవాని జీవితంలో తీరని స్వప్నం.. ఎంత రెక్కల కష్టం చేసినా నాలుగువేళ్లు నోట్లోకి వెళ్లటానికి అపసోపాలు పడుతున్న బడుగు జీవులు రూపాయి, రూపాయి కూడబెట్టుకుని గత ప్రభుత్వంలో శ్రీకాళహస్తి నియోజకవర్గంలో నిర్మించుకున్న ఇళ్లను ముఖ్యనేత ఆదేశాలతో రెవెన్యూ అధికారులు కనీసం కనికరం చూపకుండా పేదల ఆశల గూళ్లను నేలమట్టం చేస్తున్నారు. అప్పట్లో అదే రెవెన్యూ శాఖలోని అధికారులే ఇళ్లు నిర్మించుకుంటుంటే అవి అక్రమమని తెలిసి ఎందుకు అడ్డుకోకుండా ఎంజాయ్‌మెంట్ పట్టాలు ఇచ్చారు. ప్రస్తుతం అదే అధికారులు ఎవరి మెప్పు కోసం కూల్చుతున్నారోనని పేదల శాపనార్థాలు అరణ్య రోదనగా మిగిలాయి.'

నియోజకవర్గంలో శ్రీకాళహస్తి, రేణిగుంట, ఏర్పేడు, తొట్టంబేడు మండలాల్లో అక్రమ నిర్మాణాల పేరుతో సుమారు వెయ్యి ఇళ్లు నేలమట్టం చేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక ఓ వైపు వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, గ్రామస్థాయి నాయకులపై భౌతిక దాడులను చేయడంతోపాటు అక్రమ కేసులు బనాయించి తీవ్ర భయోత్పాతాన్ని సృష్టిస్తున్నారు. మునుపెన్నడూ లేని సంస్కృతికి భీజం వేశారు. తాజాగా మూడు రోజుల కిందట రేణిగుంట మండలం కుర్రకాల్వలో అక్రమ నిర్మాణాలని తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా పోలీసు, రెవెన్యూ బలగాలతో 77 ఇళ్లు కూల్చివేశారు.

గతంలో రెవెన్యూ అధికారులే...:

గతంలో రేణిగుంట మండలంలోని పేదలకు ఏర్పేడు మండలం పాగాలి సమీపంలో జగనన్న కాలనీ వద్ద ఇళ్లను కేటాయించి, ఇంటి పట్టాలు మంజూరు చేశారు. అయితే రైతుల నుంచి తీసుకున్న భూముల పరిహారాన్ని కొంతమంది రైతులకు మాత్రమే వేసి, మిగిలిన రైతులకు పరిహారం ఇవ్వకుండా జాప్యం చేశారు. దీంతో రైతులు అడ్డుకోవడంతో అక్కడ స్థలాలు చూపే పరిస్థితి లేకపోవడంతో అప్పటి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికి స్థానికులు ఇంటిస్థలాల కోసం మొర పెట్టుకున్నారు. దీంతో ఆయన సమస్యను పరిష్కారం చూపాలని రెవెన్యూ అధికారులను కోరడంతో కొంతమందికి మండలంలోని మిగులు భూముల్లో ఇంటిస్థలాలకు కేటాయించారు. లబ్ధిదారులకు ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్లు, ఇంటి పన్నులు మంజూరు చేశారు. దీంతో పేదలు అప్పు చేసి చిన్నపాటి రేకుల షెడ్లను నిర్మించుకున్నారు. అప్పట్లో నిర్మించిన ఈ ఇళ్లన్నీ అక్రమం అయితే నిర్మాణ దశలో రెవెన్యూ అధికారులు కళ్లు మూసుకుని విధులు నిర్వహించారా..? అని పేదలు ప్రశ్నిస్తున్నారు.

పేదల ఇళ్లే లక్ష్యంగా దౌర్జన్యకాండ

శ్రీకాళహస్తి పట్టణంలోని రాజీవ్‌నగర్‌లో 300 ఇళ్లకు పైగా నేలమట్టం చేసి సుమారు రూ.5 కోట్లు మేరకు పేదల ఆస్తులకు నష్టం కలిగించారు. రేణిగుంట మండలంలో తూకివాకం పంచాయతీ వివేకానంద కాలనీలో 125 ఇళ్లు, సీబీఐడీ కాలనీ 28 ఇళ్లు, కుర్రకాల్వ పద్మానగర్ 150 ఇళ్లు, చెంగారెడ్డిపల్లిలో 135 ఇళ్లు, వెంకటాపురం పంచాయతీ పరిధిలో 40 ఇళ్లు కూల్చివేశారు.

కూల్చివేయనందుకే తహసీల్దార్ బదిలీ

అక్రమ నిర్మాణాల పేరుతో వైఎస్సార్ సీపీ సానుభూతిపరుల ఇళ్లను కూల్చివేయనందుకు రేణిగుంటకు చెందిన గత తహసీల్దార్‌ను బదిలీ చేశారు. ప్రస్తుతం ఉన్న తహసీల్దార్ నియోజకవర్గ ప్రజాప్రతినిధి ఆదేశాలే ప్రభుత్వ నిబంధనలు అన్నట్లుగా వ్యవహరిస్తూ పేదలపై ప్రతాపం చూపుతున్నారు. కొన్ని నెలల కిందట రేణిగుంట మండలంలోని చెంగారెడ్డిపల్లి ఎస్టీ కాలనీలో ఎస్టీలకు చెందిన ఇళ్లను పోలీసు బలగాలతో తలుపులు మూయించి అర్ధరాత్రి లైట్లు ఆపి, జేసీబీలతో ఇళ్లన్నీ నేలమట్టం చేశారు.


అధికారులు ఇచ్చిన ఇంటిపత్రాలు


గ్రామ పంచాయతీ ఇచ్చిన పన్ను రశీదు


యంత్రాలతో ఇళ్లు కూల్చివేస్తున్న అధికారులు(ఫైల్)

మా ఉసురు తగులుతుంది..



కూలీనాలీ చేసుకుని బతికేటోళ్లం.. సొంతిల్లు లేకుండా బాడుగ కట్టలేక ఎన్నో అవస్థలు పడ్డాం. గత ప్రభుత్వంలో మాకు ఇంటి స్థలం చూపారు. రూ.లక్ష అప్పు చేసి ఇళ్లు నిర్మించుకున్నాం. అప్పట్లో రెవెన్యూ అధికారులు మాకు అనుభవ పట్టాలు ఇచ్చారు. ఇంటిపన్ను వేశారు. కరెంటు మీటర్లు తీసుకున్నాం. అయినా అక్రమ నిర్మాణాలు అని చెప్పి ఉన్న పళంగా మా ఇళ్లన్నీ కూల్చేశారు. ప్రాధేయపడినా కనికరించలేదు. మా ఉసురు తగులుతుంది. – ఏసమ్మ, పద్మనగర్, కుర్రకాల్వ, రేణిగుంట మండలం

పేదలపై ఎందుకు కక్ష



కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి నియోజకవర్గంలో అధికారులు ఎందుకో పేదలపై కక్ష కట్టారు. ఎవరి మెప్పు కోసమో పేదలను మరింత అప్పుల ఊబిలోకి నెట్టేస్తున్నారు. అవి అక్రమ నిర్మాణాలైతే ఇళ్లు కట్టుకుంటున్న సమయంలో రెవెన్యూ అధికారులకు కనిపించలేదా? నియోజకవర్గంలో వందల ఎకరాలు పెద్దలు ఆక్రమించుకుని దర్జాగా వెంచర్లు వేసుకుని అమ్ముకుంటుంటే అవేమీ రెవెన్యూ అధికారులకు కనబడలేదా? – హరినాథ్, గిరిజన సంక్షేమ సంఘం జిల్లా నాయకుడు, రేణిగుంట

అధికారులు తొత్తులుగా వ్యవహరిస్తున్నారు..



నియోజకవర్గంలో అధికారులు పూర్తిగా ఎమ్మెల్యేకు తొత్తుగా వ్యవహరిస్తున్నారు. ఓ వైపు అన్ని చోట్ల దోచుకుంటూనే మరో పక్క పేదల ఇళ్లను కూల్చివేస్తున్నారు. బడా బాబులకు వందల ఎకరాలు భూములు ఉచితంగా కట్టబెడుతున్న ప్రభుత్వం పేదల ఇళ్లను కూల్చివేయడం దుర్మార్గం. రూ.లక్షలు అప్పు చేసి ఇళ్లు కట్టుకుంటే కూల్చివేయించటం చాలా దుర్మార్గం. రాష్ట్రంలో ఎక్కడా లేని సంస్కృతి శ్రీకాళహస్తిలోనే జరుగుతోంది. మా ప్రభుత్వం వచ్చాక న్యాయం చేస్తాం. – బియ్యపు మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, శ్రీకాళహస్తి

భక్తులపై దాడి చేసిన ఆటోడ్రైవర్లపై కేసు

తిరుపతి క్రైమ్ : తిరుమల శ్రీవారి దర్శనానికి విచ్చేసిన భక్తులపై దాడి పాల్పడ్డ ఆటో డ్రైవర్లపైన ఈస్ట్ పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గిరి ఆదివారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. జీవకోనలో నివాసం ఉంటున్న మనీ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రాపిడోలో ఒంగోలుకు చెందిన భక్తులు ఆటో బుక్ చేయగా మణి రైల్వేస్టేషన్ వద్దకు చేరుకున్నాడు. భక్తులు ఎనిమిది మంది ఆటోలో ఎక్కేందుకు ప్రయత్నించగా.. ఆటోలో నలుగురు కానీ ముగ్గురు కానీ ఎక్కాలని మణి భక్తులకు తెలిపారు. మొత్తం ఎనిమిది మంది ఉన్నారని మరో ఆటోను బుక్ చేసుకోవాలని కోరాడు. ఇంతలో ప్యాసింజర్లతో మాట్లాడుతున్న సమయంలో అక్కడ స్టాండ్‌లో ఉన్నటువంటి డ్రైవర్లు సమీర్ , బాలకృష్ణ మరికొందరు ఆటో డ్రైవర్లు వచ్చి రాపిడో మణితో గొడవపడ్డారు. ఇక్కడ మేము మాత్రమే ఆటోలో భక్తులను ఎక్కించుకోవాలని గొడవపడ్డారు. ఇంతలో భక్తులు డబ్బులు ఇచ్చేది మేము అని మీరెవరు గొడవపడానికని ఎదిరించడంతో భక్తులపై దాడులకు పాల్పడ్డారు. అంతేకాకుండా రాపిడో ఆటో డ్రైవర్ మణిని రైల్వే స్టేషన్ వద్ద కనిపిస్తే చంపేస్తామని బెదిరించి పంపించారు. అయితే సోషల్ మీడియాలో ఈ వీడియో చక్కర్లు కొట్టడంతో.. పోలీసుల ఆటో డ్రైవర్‌ను పిలిపించి కేసు నమోదు చేసి.. భక్తులపై దాడి చేసిన అందరిని అరెస్ట్ చేశారు.

బురిడీ కొట్టించిన మహిళలు అరెస్టు

– మహిళల వద్ద నుంచి 12 గ్రాముల చైను, రెండు కార్లు స్వాధీనం

నాగలాపురం : బంగారు నగల దుకాణంలో చైను దొంగతనం కేసులో నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ సునీల్ తెలిపారు. జూలై 19వ తేదీ నాగలాపురం బజారువీధిలోని మహావీర్ బంగారు దుకాణంలో ఇద్దరు మహిళలు బంగారం కొనుగోలుకు వచ్చినట్లు వచ్చి 12 గ్రాములు విలువ గల చైన్ అపహరించుకుని వెళ్లారు. షాపు యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, సీసీ పుటేజీ ఆధారంగా ఆదివారం మధ్యాహ్నం 12.30 గంటలకు స్థానిక బైపాస్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆ కేసుకు సంబంధించిన నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి బంగారు చైను, కార్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు నిందితులైన చింతలపల్లి పంచాయతీ, వాయల్పాడు మండలం, అన్నమయ్య జిల్లాకు చెందిన వేముల జ్యోతి(35), భర్త వేముల నరేష్(37), వేముల నరసమ్మ(35), భర్త వేముల తిమ్మయ్య(36) ఈ నలుగురిని అరెస్టు చేసి రిమాండుకు తరలించామని తెలిపారు. కేసు ఛేదించడంపై నాగలాపురం పోలీసులను స్థానికులు, వ్యాపారులు అభినందించారు. ఎస్ఐ సునీల్ తోపాటు శిక్షణ ఎస్ఐ ప్రసాద్, తదితరులు ఉన్నారు.

మన బండ్లే.. వదిలేయండి!

కలువాయి (సైదాపురం) : మండలంలోని పెన్నా బద్వేల్ తిప్ప వద్ద నుంచి అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న ట్రాక్టర్లను ఆదివారం కలువాయి పోలీసులు, వీఆర్వోలు పట్టుకున్నారు. కలువాయి తహసీల్దార్ ఫిర్యాదు మేరకు పోలీసులు పెన్న బద్వేల్ తిప్ప వద్ద అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్నారు. అయితే జనసేనకు చెందిన ఓ కీలక నేత ఇటు పోలీస్ శాఖ, రెవెన్యూ శాఖకు కాల్ చేసి అవి మన బండ్లే వదిలేయండి అంటూ హుకుం జారీ చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే అకస్మాత్తుగా అప్పటికే అక్కడికి మీడియా వెళ్లడంతో ట్రాక్టర్లను కలువాయి పోలీస్ స్టేషన్‌కు తరలించాల్సి వచ్చింది. తహసీల్దార్ రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని పోలీస్ శాఖ అధికారులు పట్టుబట్టారు. పెన్న బద్వేల్ తిప్ప వద్ద 10 ట్రాక్టర్లు, ఒక జేసీబీ ఉన్నాయి. పోలీసులు పట్టుకున్న సమయంలో ట్రాక్టర్‌లో గ్రావెల్ ఉంది. స్టేషన్‌కు చేరే సరికి కేవలం మూడు ట్రాక్టర్లే ఉన్నాయి. అవి కూడా ఖాళీగానే దర్శనమివ్వడం గమనార్హం. తీరా కూటమి నేతల ఒత్తిళ్ల కారణంగా చివరకు కేసు నమోదు చేయకుండానే మైనింగ్ శాఖకు అప్పగించేసి చేతులు దులిపేసుకున్నారు.


పోలీస్ స్టేషన్‌లో ఖాళీగా దర్శనమిస్తున్న ట్రాక్టర్లు

శ్రీసిటీలో వేడుకగా తిరంగా యాత్ర



శ్రీసిటీలో తిరంగా యాత్రలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు


శ్రీసిటీ (సత్యవేడు) : భారత సైనిక దళాల ధైర్యసాహసాలను స్మరించుకుంటూ రెండు నెలలుగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'తిరంగా యాత్ర' ఆదివారం శ్రీసిటీలో వేడుకగా జరిగింది. ఐఐఐటీ– శ్రీసిటీ, కియా విశ్వవిద్యాలయం, స్టేషన్–ఎస్ శ్రీసిటీ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఐఐఐటీ శ్రీ సిటీ ఆవరణ నుంచి యాత్ర ప్రారంభమై సెంట్రల్ ఎక్స్‌ప్రెస్‌వే మీదుగా కొబెల్కో కూడలి వరకు కొనసాగింది. విద్యార్థులు, అధ్యాపకులు నివాసితులు త్రివర్ణ పతాకాన్ని చేతపట్టి స్వేచ్ఛ, ఐక్యత, ప్రజాస్వామ్యం వర్ధిల్లాలని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ట్రిపుల్ ఐటీ – శ్రీసిటీ మాజీ చైర్మన్ , స్టాలినిటీ సంస్థ సీఈఓ బాల సుబ్రమణ్యం(బాల) ముఖ్య అతిథిగా హాజరై యాత్రలో జెండా ఊపి ప్రారంభించారు. ఆపరేషన్ సింధూర్‌ను విజయవంతం చేసిన భారత సాయుధ దళాల ధైర్యం, త్యాగానికి తగిన గౌరవంగా ఈ తిరంగా యాత్ర చేస్తున్నట్లు పేర్కొన్నారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన సందేశంలో ఈ తిరంగా యాత్ర తరువాత తరానికి ఆదర్శంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో ట్రిపుల్ ఐటీ శ్రీసిటీ రిజిస్ట్రార్ కల్నల్‌టి ఉమాశంకర్, కియా విశ్వవిద్యాలయం చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ సత్యవరణ్, శ్రీనివాసులు రెడ్డి, శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్) రమేష్ కుమార్ పాల్గొన్నారు.

జీలపాటూరులో విషాదం


గురవయ్య మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న సర్పంచ్ శివకుమార్

పెళ్లకూరు: మండలంలోని జీలపాటూరు దళిత వాడలో విషాదం నెలకొంది. గ్రామానికి చెందిన కత్తి గురవయ్య(42) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు.. శనివారం సాయంత్రం గురవయ్య ఓ ప్రయివేట్ పరిశ్రమలో విధులు ముగించుకొని నాయుడుపేట చంద్రబాబునాయుడు కాలనీ సమీపంలో రోడ్డు పక్కన నడిచి వెళ్తున్నాడు. అదే సమయంలో ట్రాక్టర్ ఢీకొంది. తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. స్థానిక సర్పంచ్, గ్రామ పెద్దలు మృతుని కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. మృతునికి భార్య ధనమ్మ, కుమారులు లోకేష్, ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


ప్రమాదంలో మృతి చెందిన కోగిల జయరామ్

శ్రీకాళహస్తి: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం పాలైన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. రెండవ పట్టణ పోలీసుల కథనం మేరకు లింగమనాయుడుపల్లెకు చెందిన కోగిల జయరాం వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో సొంత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై ఆయన బయలుదేరగా తొట్టంబేడు మండలం మల్లిగుంట వద్ద జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనం–కారు ఢీకొన్నాయి. ఈ ఘటనలో కోగిల జయరామ్ అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ఘటనా స్థలంలో ద్విచక్ర వాహనం, కారు

12న ఆటో, ట్యాక్సీ డ్రైవర్ల ఆందోళన


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆటో, టాక్సీ యూనియన్ నేతలు

తిరుపతి కల్చరల్: ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం పథకం కారణంగా ఉపాధి కోల్పోతున్న ఆటో, టాక్సీ డ్రైవర్లకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆటో అండ్ టాక్సీ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్.శివ డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆర్టీసీ బస్టాండ్ వద్ద అంబేడ్కర్ సర్కిల్లో నిరసన ప్రచార కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. 12న రాష్ట్ర వ్యాప్త ఆందోళనలో భాగంగా ఉదయం 10 నుంచి ఆర్టీఓ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామన్నారు. ఆటో, టాక్సీ డ్రైవర్లందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆటో, టాక్సీ యూనియన్ నేతలు సురేష్, పురుషోత్తంరెడ్డి, వెంకటేష్, రమేష్, ప్రమీల, పార్వతి, వాణిరెడ్డి, సతీష్, కాశి, భాస్కర నవీన్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

బైక్‌లు ఢీ : ఇద్దరి మృతి

- ముగ్గురికి గాయాలు


వెంకట రమణయ్య మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న చిట్టమూరు ఎస్ఐ చిన్న బలరామయ్య

చిట్టమూరు : మండల పరిధిలోని మొలకలపూడి బోటు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు.. వాకాడు గ్రామానికి చెందిన కావలి కిరణ్ కుమార్ (40), నాయుడుపేటకు వెళ్లి తిరిగి స్వగ్రామం వాకాడుకు మోటారు సైకిల్‌పై వస్తున్నాడు. ఈ క్రమంలోనే పెళ్లకూరు మండలం పున్నేపల్లి గ్రామానికి చెందిన కోవూరు వెంకటరమణ (42) నాయుడుపేట మండలం గొట్టిప్రోలు గ్రామానికి భార్యా, పిల్లలతో వెళ్లి తిరిగీ పున్నేపల్లికి బైక్‌పై బయలు దేరగా రెండు మోటార్ సైకిళ్లు ఎదురెదురుగా మొలకలపూడి గ్రామ సమీపంలోని బోటు వద్ద ఢీ కొనడంతో వాకాడుకు చెందిన కిరణ్‌కుమార్, పున్నేపల్లికి చెందిన కోవూరు వెంకటరమణ మృతి చెందారన్నారు. అయితే మోటార్ సైకిల్ వెనుక కూర్చుని ఉన్న వెంకటరమణ భార్య, పిల్లలకు తీవ్ర గాయాలు కావడంతో 108లో నాయుడుపేట వైద్య శాలకు తరలించి చికిత్స చేస్తున్నారు. చిట్టమూరు ఎస్ఐ చిన్న బలరామయ్య సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇద్దరి మృత దేహాలను నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు పోస్టుమార్టంకు తరలించారు. వాకాడుకు చెందిన కిరణ్‌కు భార్య పిల్లలు ఉన్నారు. దీంతో రెండు గ్రామాల్లో తీవ్ర విషాదం చోటు చేసుకుంది.


కిరణ్‌కుమార్(ఫైల్)

పెన్నేపల్లిలో విషాదం

పెళ్లకూరు : మండలంలోని పెన్నేపల్లి గ్రామానికి చెందిన కోవూరు వెంకటరమణ ఆదివారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో గ్రామంలో విషాదం నెలకొంది. గ్రామంలోని దళిత కాలనీకి చెందిన వెంకటరమణ భార్య కామాక్షి పిల్లలు కలిసి గొట్టిప్రోలు గ్రామంలో చర్చ్‌లో ఆరాధన ముగించుకొని బైక్‌లో తిరిగి స్వగ్రామం వస్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. వెంకటరమణ మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.